# స్వరాజ్యం

జెట్టి నాగయ్య బ్రహ్మిత్తి రావు

తాతల తండ్రుల ఆస్తులుంటే తన స్నేహితుల్లాగే తనుకూడా జీవితాన్ని ఎంజాయ్ చేయగలడు. వాళ్ళు ఒక్క సారి, కనీసం ఒక్కసారి క్లాసుకివచ్చి పాఠం విన్నపాపానపోయారా? లేదు. అయినా ఎటెండెన్స్ రిజిష్టర్లో ప్రెజెంట్ మాత్రం వుంటుంది. తనలా కష్ట పడి నోట్సులు వ్రాయలేదు. రికార్డులు వెయ్యలేదు. అయినా మార్కులువస్తాయి. తను కష్టపడి చదివేడు. ఏం లాభం, అత్తెసరు మార్కులు. ఆ లెక్చరర్లకి కాకా కొట్టలేని దౌర్భాగ్యపు పరిస్థితికి, తన కులం వాళ్ళకులం కాని దిక్కుమాలిన ఫీలింగ్స్‌కి తను బలై పోయేడు. ప్రిన్సిపాల్ ఎంచక్కగా మాట్లాడేవాడు. ఆయనమాటలకు తానెలా పొంగి పోయేవాడు. ఆరోజు ఆగష్టుపదిహేనున ఆయనిచ్చిన ఉపన్యాసం తనలో ఎన్ని ఆదర్శాలను నింపింది. ఎంతవుత్తేజాన్ని తలలో రేకెత్తించింది, ఇక్కడ సమానత్వం ఎర్రకోటమీద జాతీయ పతాకంలా స్వేచ్ఛగా ఎగురుతున్న దేశమట. ఆమాటలన్నీ మాయలని ఇన్నాళ్లకి తను తెలిసింది.

తనకి మెరిట్ మీద వచ్చిన స్కాలర్ షిప్ తనతో సంతకం చేయించుకుని, వాడి కులంవాడికి ఇప్పించిన ప్రిన్సిపాల్ అసలు స్వరూపం తెల్సాకా,

చదువుల్లోనూ దారుణాలుంటాయని మొట్టమొదటసారే తెల్సుకున్నాడు.

అయినా ఎలా చదివేడు. అందరూ తనకే క్లాసు ఫస్టు వస్తుందనేవారు. కానీ... కానీ... కాలేజీల్లోని గ్రూప్ సిస్టమ్‌కి తను బలైపోయాడు. ఏదో సెక్రటీరీ ఎలక్షన్లోజరిగిన గొడవని దృష్టిలో పెట్టుకుని, కసిని పెట్టుకుని తన జీవితాన్ని ముక్కలుచేసిన ప్రిన్సిపాల్....

విద్యార్థుల జీవితాల్తో ఆటలాడే ఇలాటి వాళ్ళని షూట్ చేసెయ్యాలి.

—ఆఖరికి థర్డ్‌క్లాసులో పాసయ్యాడు. ఉద్యోగం ఎక్కణ్ణుంచి వస్తుంది. బిచ్చం ఏంవిటి పిడికెడు పడెయ్యటానికి దానికెన్ని కావాలి, మెరిట్ తప్ప అన్ని ఉండాలి.

నీకు గొప్ప రికమెండేషన్ అయిన డబ్బయినా ఉండాలి. నువ్వు రెకమెండేషన్ చేసేవాడి అడుగుల మడుగులొత్తాలి. వాడు అరమైలు దూరం వున్నాడనగానే నమస్కారం పెట్టి వినయంగా నిలబడాలి. అప్పుడా పెద్దమనిషి నిన్ను చూసీచూడనట్టుగాచూసి కళ్లతో పలకరించి 'అవునూ.. ఇంటిదగ్గర చెప్పులు మరచిపోయాను... తెచ్చిపెడుదూ అంటాడు. చస్తావా.. ఆచెప్పులు తేవాలంటే నీ వ్యక్తిత్వం చంపుకోవాలి. వాళ్లు చేసేపని నీవ్యక్తిత్వాన్ని చంపడమే. నువ్వు ఆచెప్పులు తొడుక్కోలేవు. చేత్తోమోసుకురావాలి. వెకిలినవ్వు నవ్వుకుంటూ నువ్వాపని చెయ్యక తప్పదు. వాడిముందు నువ్వు తరతరాల బానిసవి.

— పరీక్ష పేసయ్యాక అలాంటి పెద్దమనిషి దగ్గరకి తండ్రి తీసికెళ్లాడు ఆయనో రాజకీయ నాయకుడు ఆయన అదేదో పూర్నించి ఈ వూరొచ్చిన కొత్తలో చేగొడీల వ్యాపారం, జంగిడీ నెత్తిమీద పెట్టుకొని అమ్ముకునేవాడట అప్పుడు జగన్నాథం నాన్న అతన్దగ్గరే చేగొడేల్ని కొంటుండేవాడట. అదీ పరిచయం.

"వూఁ మీ అబ్బాయా... డిగ్రీదాకా

చదివించావేటోయ్ పంతులూ..."

తండ్రి నమస్కారం పెట్టి వినయంగా నీగోళ్ళలాగా నిలబడ్డాడు.

"వుజ్జోగం.. ఏఁ వుజ్జోగాలయ్యా.. నువ్వు నన్ను వుజ్జోగం అని అడిగినంత మాత్రాన అయిపోతుందా.. అటుసూడు ఆళ్లందరూ దేనికొచ్చారు.. అందుకే.. వుజ్జోగం.. వుజ్జోగం.. ఆఁ.. అన్నీ బాగానేవున్నాయి... మార్కులూ... బాగానే వచ్చాయి... సెకెండు క్లాసు రెండు మార్కుల్లో తప్పిపోనాదా... పోనీ.. సూస్తా..లే.. కాని.. వుజ్జోగానికి కావల్సింది సదువు కాదయ్యా'.. ఎంతిచ్చుకోగలవన్నదన్నది... మాట'

అసలు విషయానికొచ్చాడాయన.

'అంటే.. లంచవా ప్రభూ"

"అలాగంటే కొంపలంటుకుపోతాయ్. ఏదో మన సంతోషం కొద్దీ ఇచ్చే వాపతు. ఆ అదికార్లు ఆళ్లెంతో సొమ్ములు పోసి ఆ వుజ్జోగాలు కొనుక్కున్నారా.. లేదా.. అంచేత ఆ డబ్బు రాబట్టుకోవాలా లేదా..."

"మా తాతలు పౌరోహిత్యం చేసి సంపాదించిన జాగాలో పూరిపాక వేసుకున్నాను. అది అమ్మేస్తే ఎంతొస్తాది.. అదే..."

తండ్రి. ఆ అమాయక ప్రాణికి ఈ ప్రపంచంలో మాయ తెలీదు. ఇప్పుడు మంచిలేదు. మర్యాదాలేదు. దోపిడీ న్యాయం. నీ పేదరికాన్ని అవకాశంగా తీసుకుని నిన్ను కుక్కనీ గాడిదనూ చేస్తారు. నీ కష్టానికి మొసలి కన్నీళ్ళు కారుస్తారు. నటన... నటన... ఈ ప్రపంచంలో ప్రతీదీ నటనే.... వాళ్ళ అవసరం తీరగానే నిన్ను గజ్జి కుక్కలా తరుముతారు.

ఆ పెద్దమనిషి ఇదిగో వుద్యోగం అదిగో వుద్యోగం అన్నాడు. పలానా ఆఫీసరుతో చెప్పాను, వాడి ముండతో చెప్పానన్నాడు. ఖర్చులికి పది తే... పాతిక.... వంద తే.'.. అనీవోడు... ఏదీ... ఉష్‌కాకి... ఉద్యోగం కనుచూపు మేరంతా మెరిసే ఎండమావి.

అతగాణ్ణి నమ్మి తనెంత సేవచేసా డు. ఎంత అర్ధరాత్రయినా వాడింటి ముందు, వాడి కుక్కతోపాటు తనూ కాపలా కాసేవాడు. ఏ అర్ధరాత్రో, అతగాడు తాగి తూలూతూ,

"హిప్పటిదాకా వెయిట్ స్సేస్తున్నాం వా...స్సా... స్సా... రీ... హివేళ వీలవలేదు... ర్రే ర్రేపు తేలుస్తాను.... డోంట్ ...వర్రీ... ఎబౌట్ దట్ ...' ఆమాత్రం మాటలకే తను పొంగి పోయేవాడు.

నిజమే.

తను వుద్యోగస్తుడైతే ఎంతబాగుం టుంది. ఇష్టమొచ్చినట్టుగా తిండి. మంచి ఇల్లు. మంచి బట్టలు. బోంబేడైయింగ్ ఎడ్వర్టైజ్ మెంట్ లో విజయేంద్రలా తను ఫుల్ సూట్లో అంచక్కా... అం చక్కా... ఆ సిన్మాయాక్టరు... టీనా మునీమ్ బాగుంటుంది... ఆ కళ్ళంటే తనకిష్టం... ఆ యాపిల్ రంగు బుగ్గలు వాటి మీద మెత్తటి ముద్దులు.... అలాం టి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుం టాడు... పిల్లలు టింకూలాంటి బాబూ వుంటే కావలసిందే మరి..." అదేదో ఎడ్వర్టైజ్ మెంట్ లో చూపించే అంద మైన ఆరోగ్యమైన పిల్లలు. ఇల్లంతా హాయి.. మనసంతా హాయి... హాయి...

కమ్మని కలలు .. ఆ కలలకు అం తులేదు.

"నువ్వు ఫోంచేసావా... చేసే వుంటావు.... వెళిపోయేముందు చిన్న పని చేసి పెడతావా...." ఎప్పుడో మధ్యాహ్నం తల్లి తను తినడం మాని పెట్టిన పచ్చడి మెతుకులు.

"చెప్పండి... పరవాలేదు..."

"కళ్యాణి వైన్స్ తెరిచుంటుంది.. ఓరమ్ బాటిల్.... ఆదార్నే అళకాపురి లో బిర్యానీ కట్టించుకు వచ్చెద్దూ..."

అలాగే... అలాగే....

అలాగే చెప్పిన పనంతా చేసాడు.

కానీ ఆఖరుకు "లాభం లేదబ్బాయ్ మన ప్రయత్నం కాకి ప్రయత్నమై పోయింది... గెద్ద తన్నుకు పోయి

ంది..." ఒక్క మాటతో సరి. ఇంకొకడి దగ్గిర ఎక్కువ డబ్బు పుచ్చుకుని తనకు ద్రోహం చేసాడు.

తనకా వుద్యోగం వస్తుందని ఎంత ఆశపడ్డాడు. ఎన్ని దేవుళ్ళకి మొక్కాడు. ఎన్ని ముడుపులు కట్టాడు. పేదవాడి ముడుపులకు మొక్కులకు విలువ లేదని తెల్సిపోయింది.

రేపో ఎల్లుండో జీవితం చాలించడానికి సిద్ధంగావున్న తల్లి దండ్రులుండడానికి ఆ మాత్రం నీడకూడా కరువై పోయింది. ఆవున్న కొంప అప్పుల్లో మునిగి పోయింది. తను, తనతోపాటు తనని నమ్ముకున్నవాళ్ళు సముద్రంలో మునిగి పోయారు.

"చచ్చిపోవాలి... వురి పోసుకుని చచ్చిపోవాలి... ఎండ్రిన్ తాగి.... లేకపోతే... కాంపోజ్ టేబ్లెట్లు మింగి తే.... లేకపోతే గన్నేరు పిక్కలు నమిలి... టిక్ ట్వెంటీ తాగి.. లేకపోతే ఏ చెరువో... నుయ్యో... ఏరైలో... సిటీబస్సో... ఏదో ఒకటి... ఈ బ్రతుకు దారి కటూ ఇటూ బాష్పధారల్... ఎవరో బాగానే అన్నారు.. ఏడుపు..ఏడుపు తను ఏడవలేదు... హాయిగా చచ్చిపోవాలి...

—రైలు కూతతో ఆలోచన్లోంచి బైటకొచ్చాడు జగన్నాథం. కోతి కొమ్మచ్చులాటలో కర్ర తీసుకుని కొమ్మల వెనక దాగునే పాపలాగా సూర్యుడు మబ్బుల వెనకనుంచి తొంగి చూస్తున్నాడు.

కుప్పలు కుప్పలుగా గాభరాగా వెళిపోతున్న పిట్టలు.

ఈ దృశ్యాలు ఎంత సేపోలేవు.

చీకటి.

నిండా పేరుకున్న దుఃఖంలా.

పది నిమిషాల్లో రైలు వస్తుంది. పదకుండో నిమిషంలో తనిక్కడ వుండడు మరో లోకంలో. అక్కడ నీ వ్యక్తిత్వాన్ని నాశనం చేసే రాక్షసులు, వుండరు.

చినుకులు. చినుకులు.

పట్టాలకు కొంచెం దూరంలో ఓ పాత గుడి అక్కడ నిలబడ్డాడు.

వర్షం రానూనూ ఎక్కువౌతోంది.

దూరంగా రైలు కూత. వెళ్ళి పట్టాలకు అడ్డంగా పడుకోవాలని మొండిగా నిశ్చయించుకున్నాడు.

అతని చెయ్యికేదో మెత్తగా తగిలింది. భయమేసింది.

"ఎ... ఎవర్నువు ఏం కావాలి... గాభరాగా అడిగేడు

"అన్నా పది పైసలివ్వవూ... ఆకలి..."

"లేవు...." చిరాగ్గా చెప్పాడు.

"అన్నా... పది పైసలిస్తే రొట్టొస్తాది... ఇవ్వన్నా...."

పదిపైసలు లేనట్టు జ్ఞాపకం. అయినా వెతికాడు. పదిపైసలే దొరికింది. ఎలాగొచ్చిందో జ్ఞాపకం లేదు. ఉదయం టీ తాగమని స్నేహితుడెవడో ఇచ్చాడు. ఐదు పైసల్లేక అలాగే వదిలేసాడు.

గబగబా తీసి ఆపిల్లవాడి చేతిలో పెట్టాడు. ఆచీకట్లో ఆపిల్లవాడి ముఖంలో సంతోషం గుర్తుపట్టలేక పోయాడు కానీ తను మాత్రం ఏదో తెలీని ఆనందాన్ని పొందాడు.

"వస్తానన్నా...."

ఆ పిల్లడు పట్టాలు దాటుకుంటూ, హుషారుగా గెంతుతూ అంత వర్షంలోనూ ఏదో ఆశయం కోసం వెళ్తున్న వాడిలా సూటిగా పరుగెత్తాడు.

అవే చినుకులు. ఏమాత్రం తగ్గలేదు. అదే చీకటి. ఎక్కడా వెలుగు లేదు. ఆ వూహ తెలీని పిల్లవాడినుంచి ఏం నేర్చుకున్నాడో గాని జగన్నాథం (ఆత్మహత్యా ప్రయత్నం మానుకుని) చీకటిని చీల్చుకుని, సూదుల్లా పొడుస్తున్న చినుకుల్ని చీల్చుకుని పట్టాలు దాటి రోడ్డుమీద పడ్డాడు.